క్లుప్తంగా

21 వరకు ఇంటర్న్‌షిప్ దరఖాస్తుకు గడువు

కాకినాడ సిటీ: విద్యార్థుల్లో నైపుణ్యపరమైన శిక్షణతో కూడిన విద్యను, 12 నెలల పారిశ్రామిక అనుభవం అందించాలని పీఎం ఇంటర్న్‌షిప్ స్కీమ్ ప్రారంభించినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం కొండలరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. యువతకు 20 కంటే ఎక్కువ రంగాల్లో ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఇంటర్న్‌షిప్ చేయాలనుకునే వారికి దేశవ్యాప్తంగా అవకాశాలుంటాయన్నారు. ఈ స్కీములో అర్హత పొందేందుకు దరఖాస్తుదారులు తమ ఉన్నత పాఠశాల విద్యను పూర్తి చేసి, ఐటీఐ, పాలిటెక్నిక్, డిప్లమో, బీఏ, బీఎస్సీ, బీకాం, బీబీఏ, బీసీఏ వంటి డిగ్రీలను కలిగి ఉండాలన్నారు. దూర విద్య విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. ప్రధాన మంత్రి జీవన్‌జ్యోతి, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజనల ద్వారా ప్రతి ఒక్కరికీ బీమా అందిస్తుందన్నారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా ఈ ఇంటర్న్‌షిప్‌కు ఆధార్, బయోడేటాతో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. ఎంపికైన వారికి 12 నెలల పాటు రూ.5 వేల చొప్పున అందిస్తారన్నారు. ఏకకాల గ్రాంటు కింద రూ.6 వేలు ఇస్తారన్నారు. ఇంటర్న్‌షిప్ ఈ నెల 10న ప్రారంభమైందని, జనవరి 21 వరకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఉందన్నారు. 21–24 ఏళ్ల మధ్య వయసున్న అభ్యర్థులే ఈ పథకం ద్వారా లబ్ధి పొందేందుకు అర్హులని కొండలరావు తెలిపారు. వివరాలకు 99662 91339 నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

కాకినాడ అధికారుల నంబర్లు

మున్సిపల్ అధికారులు	
కమిషనర్	9100945696
అదనపు కమిషనర్	9849907096
డిప్యూటీ కమిషనర్	9949921555
ఏసీపీ	9989743049
ఎంహెచ్‌వో	9949432320
ఎస్ఈ	9959988639
మేనేజర్	7093519888
టీపీఆర్వో	9701385284
అకౌంట్ ఆఫీసర్	9849907084
సిటీ మిషన్ మేనేజర్	7901610084
పంచాయతీ అధికారులు	
డివిజనల్ పంచాయతీ అధికారి	9849903188
ఫుడ్ ఇన్‌స్పెక్టర్	9494297564
ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ	9100121109
జిల్లా వ్యవసాయశాఖాధికారి	8331056483
దేవదాయశాఖ డివిజన్ ఇన్‌స్పెక్టర్	9290145126
గృహ నిర్మాణశాఖ డీఈ	7093930577
పశుసంవర్ధకశాఖ జేడీ	9989932835
డీసీసీబీ జీయం	8341208227
జిల్లా సహకారశాఖ అధికారి	9100109168
జీజీహెచ్‌లో ముఖ్యమైన నంబర్లు	
సూపరింటెండెంట్	98499 03870, 0884 2302001
సీఎస్ ఆర్ఎంవో	98499 03871
డీసీఎస్ ఆర్ఎంవో	98499 03871
ఆర్ఎంవో	0884 2302003
డిప్యూటీ కలెక్టర్, అడ్మినిస్ట్రేటర్	0884 2302002
అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ)	98499 03873, 0884 2302004
పోలీస్ అవుట్‌పోస్ట్	83329 57924
అత్యవసర విభాగం	0884 2302021
బ్లడ్ బ్యాంక్	0884 2302009
మెడికల్ రికార్డ్స్ సెక్షన్ (ఎంఆర్‌డీ)	0884 2302018

కరప మండల అధికారులు

ఎంపీడీఓ	9346790319
తహసీల్దార్	9849903908
ఈఓ పీఆర్ ఆర్డీ	9849352293
మండల ఇంజనీరింగ్ అధికారి	8886865417
మండల వ్యవసాయాధికారి	8331056589
ఎంఈఓ-1	8008293994
ఎంఈఓ-2	8919940656
హౌసింగ్ ఏఈఈ	7093930450
ఉపాధిపథకం ఏపీఓ	7093998259
వెలుగు ఏపీఎం	9959989273
ఎలక్ట్రికల్ ఏఈ	9440812638
ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ	9603007219
ఇరిగేషన్ ఏఈఈ	9704651826
డ్రెయినేజ్‌శాఖ ఏఈఈ	9963744219
ఆర్‌అండ్‌బి ఏఈఈ	9440818530
కరప పీహెచ్‌సీ డాక్టర్	8096940176
వేళంగి పీహెచ్‌సీ డాక్టర్	9962553545

కాకినాడ సినిమాలు



ఆనంద్ సినిమాస్:	సంక్రాంతికి వస్తున్నాం, డాకు మహరాజ్, గేమ్ చేంజర్
దేవీ సినిమాస్:	సంక్రాంతికి వస్తున్నాం, డాకు మహరాజ్, గేమ్ చేంజర్
లక్ష్మి:	డాకు మహరాజ్
సత్యగౌరి:	గేమ్ చేంజర్
తిరుమల:	డాకు మహరాజ్
సీఅండ్‌సీ1:	సంక్రాంతికి వస్తున్నాం
సీఅండ్‌సీ2:	గేమ్ చేంజర్
శ్రీప్రియ:	గేమ్ చేంజర్
పద్మప్రియ:	డాకు మహరాజ్

చీడీలపొర.. లేదా సమస్యకు తెర



చీడీలపొర డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తాచెదారం

- మేజర్ డ్రైన్‌లో పేరుకున్న పూడిక
- శిథిలమైన డ్రైనేజీ
- మొక్కలు పెరిగి అధ్వానంగా మారిన వైనం
- తీవ్ర దుర్గంధం, దోమలతో జనం అవస్థలు

కాకినాడ లీగల్: ఏడాదికి ఒకసారి మాత్రమే చీడీలపొర డ్రైనేజీ పూడికను తొలగించడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డ్రైనేజీ గోడలపై మొక్కలు పెరిగి, డ్రైనేజీ బీటలు వారుతోంది. డ్రైనేజీ చుట్టుపక్కల వారు చెత్తను నేరుగా డ్రైనేజీలో పారవేస్తున్నారు. దీంతో చెత్త పేరుకుపోయి మురుగు పారడం లేదు. ఫలితంగా డ్రైనేజీ నుంచి దుర్వాసనతో పాటు, ఈగలు, దోమలు, విష కీటకాలు తీవ్రమై ప్రజలు నిత్యం ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. నగరంలోని అశోక్‌నగర్ నుంచి ఇంద్రపాలెం కాలువకు అనుసంధానం చేస్తూ చీడీలపొర డ్రైనేజీ నిర్మించారు. అశోక్‌నగర్ నుంచి శారదాంబ గుడి, గాంధీనగర్, రామారావుపేట ప్రాంతాల మీదుగా ఇంద్రపాలెం ఉప్పుటేరు కాలువకు ఈ డ్రైనేజీ అనుసంధానంగా ఉంది. ఈ డ్రైనేజీని ఆనుకుని ప్రజలు నివాసాలు ఏర్పరచుకున్నారు. నిత్యం డ్రైనేజీలో స్థానికులు ఇళ్లలోని చెత్తచెదారంతో పాటు, పశువుల పెంటను వాటి యజమానులు ఈ డ్రైనేజీలో పారవేస్తున్నారు.

ఎక్కడికక్కడే చెత్త

చెత్త సేకరణ కోసం ఇళ్లకు వచ్చే పారిశుధ్య కార్మికులకు వ్యర్థాలను ఇవ్వకుండా డ్రైనేజీలో వేస్తుండడంతో, మురుగునీరు పారకుండా ఎక్కడి చెత్త అక్కడే నిలిచిపోతోంది. డ్రైనేజీ ప్రవహించకపోవడంతో ఈ ప్రాంతమంతా తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. స్థానికులతో పాటు, డ్రైనేజీని ఆనుకుని ప్రయాణించే ప్రజల ముక్కుపుటలు అదిరిపోతున్నాయి.

ప్రబలుతున్న రోగాలు

నిల్వ ఉన్న నీరు, ఇతరత్రా కారణాలతో ఈ ప్రాంతంలో కలుషిత గాలి పీల్చడంతో స్థానికులు వివిధ రోగాల బారిన పడుతున్నారు. దోమలతో డెంగీ, మలేరియా వంటి జ్వరాలకు గురవుతున్నారు. చీడీలపొర డ్రైనేజీ వల్ల తలెత్తుతున్న సమస్యలపై అధికారులు స్పందించి, చర్యలు చేపట్టాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు. డ్రైనేజీలో చెత్తాచెదారం వేయకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నెలకొకసారైనా పూడిక తీయాలి



చీడీలపొర డ్రైన్‌లో నెలకు ఒకసారైనా పూడిక తొలగించాలి. కాలువలో చెత్తాచెదారం, మురుగు పేరుకుపోవడంతో స్థానికంగా నివాసం ఉండే ప్రజలు, చిన్నారులు దోమల వల్ల ఇబ్బందులకు గురవుతున్నారు. మురుగును తొలగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. – కె.దుర్గాప్రసాద్, స్థానికుడు

మొక్కలు తొలగించాలి



డ్రైనేజీపై అడ్డదిడ్డంగా పెరిగిపోయిన మొక్కలను తొలగించాలి. మొక్కలు విపరీతంగా పెరిగిపోవడంతో డ్రైనేజీ శిథిలమవుతోంది. అనేకచోట్ల డ్రైనేజీ అధ్వానంగా తయారైంది. డ్రైనేజీకి మరమ్మతులు చేపట్టేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. – కె.కృష్ణ, స్థానికుడు

కొత్త జెండాలు ఏర్పాటు చేయాలి



జగన్నాథపురం వినాయక సాగర్ పార్కులో పాతబడిన జాతీయ పతాకం

బోట్‌క్లబ్: రిపబ్లిక్ డే సందర్భంగా వినాయక సాగర్ ప్రాంగణం, కలెక్టరేట్ ముఖద్వారం, టౌన్ రైల్వే స్టేషన్ జంక్షన్ వద్ద ఉన్న భారీ జాతీయ జెండాలను తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు గురువారం ఒక ప్రకటనలో కోరారు. జగన్నాథపురం వినాయక సాగర్ పార్కులో జాతీయ జెండా చిరిగి, రంగులు పూర్తిగా వాడిపోయి గత ఆరు నెలల నుండి ఇదే దుస్థితిలో ఉందన్నారు. కలెక్టరేట్, టౌన్ రైల్వే స్టేషన్ వద్ద జాతీయ పతాకాల్లో కాషాయ రంగు వెలిసిపోయి ఉన్నాయన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా పాతవాటిని పూర్తిగా తొలగించి, కొత్త పతాకాలు ఏర్పాటు చేయాలని కోరారు. జాతీయ జెండాల నిర్వహణను అక్కడి సచివాలయం బాధ్యులకు అప్పగించాలన్నారు. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం, జనవరి 26 గణతంత్ర దినోత్సవం అనంతరం వాటిని పట్టించుకోక పోవడం వలన అవి పాడైపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉపాధి హామీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం ఆవిర్భావం



సంఘ డైరీ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు తాము ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక, అపరిష్కృతంగా ఉన్న సంక్షేమ సమస్యల సాధనకు ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆఫ్ ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పేరుతో సంక్షేమ సంఘం ఏర్పాటైంది. ఈ సంఘం 2025 డైరీ, క్యాలెండర్లను కలెక్టరేట్‌లో కలెక్టర్ షణ్మోహన్ గురువారం ఆవిష్కరించారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్‌లో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ నుంచి పథక సహాయ సంచాలకుల వరకు ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు విధి నిర్వహణలో ఎదుర్కొంటున్న వివక్ష, అసమానతలు సమష్టిగా ఎదుర్కొనేందుకు సంక్షేమ సంఘం ఏర్పాటు చేసినట్లు సంఘ రాష్ట్ర నాయకులు వీవీ కిరణ్, ఆర్ ప్రభాకరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి, డ్వామా కార్యాలయ పరిపాలనాధికారి అబ్రహాం లింకన్, సంఘ నాయకులు ఎం.మహాలక్ష్మి, కేజే ప్రకాష్, వై సూర్యారావు, రమణకుమార్, ఏంపీ బెనర్జీ, కొండలరావు, మాధవి, బాలు, శ్రీనివాస్, ప్రదీప్, అవధాని తదితరులు పాల్గొన్నారు. సంఘ సభ్యులను కలెక్టర్ షణ్మోహన్ అభినందించారు. నూతన సంవత్సరంలో అందరికీ మంచి జరగాలని, అందరూ గ్రామీణాభివృద్ధికి పునరంకితం కావాలని ఆయన ఆకాంక్షించారు.

క్రీడా మైదానంలో అందరినీ అనుమతించాలి

బోట్‌క్లబ్: రంగరాయ క్రీడా మైదానంలోకి అందరినీ అనుమతించాలని బీజేపీ సౌత్ మండల అధ్యక్షుడు చెక్కా రమేష్ కోరారు. గురువారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. నగరంలో గత ఏడాది జరిగిన దుస్సంఘటన కారణంగా రాష్ట్రంలో అతి పురాతనమైన రంగరాయ మెడికల్ కళాశాల క్రీడా మైదానంలోకి ఎవరినీ అనుమతించలేదన్నారు. నగరంలో నివసిస్తున్న రిటైర్డు జడ్జీలు, సీనియర్ పాత్రికేయులు, ప్రొఫెసర్లు, రిటైర్డు ప్రభుత్వ ఉద్యోగులు, యువ క్రీడాకారులు, సైనిక, పోలీస్ ఉద్యోగాలకు తర్ఫీదు పొందేవారు గత ఐదు నెలలుగా రోడ్లపై వాకింగ్, వ్యాయామం కొనసాగించాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఇక్కడి గ్రౌండ్‌లో వ్యాయామం చేసిన ప్రముఖులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉన్నారన్నారు. అటువంటి ఘనత కలిగిన రంగరాయ క్రీడా మైదానంలోకి ప్రవేశం లేకపోవడం దురదృష్టకరమన్నారు.

కిటకిటలాడిన రైల్వే స్టేషన్



సామర్లకోట: సంక్రాంతి ప్రయాణికుల రద్దీతో సామర్లకోట రైల్వే స్టేషన్ కిటకిటలాడింది. సామర్లకోట రైల్వే జంక్షన్ కావడంతో కాకినాడ, పిఠాపురం, పెద్దాపురం, జగ్గంపేట, కిర్లంపూడి, ప్రతిపాడు తదితర ప్రాంతాల నుంచి ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. దాంతో ఆయా ప్రాంతాలకు సంక్రాంతి పండగకు వచ్చిన వారు తిరిగి సొంత ప్రాంతాలకు వెళ్లడానికి సిద్ధమయ్యారు. దాంతో ప్రయాణికులతో రైల్వే స్టేషన్ రద్దీగా మారింది. శని, ఆదివారాలల్లో రైల్వే స్టేషన్ మరింత రద్దీగా ఉంటుందని రైల్వే అధికారులు తెలిపారు.

ముగిసిన ఐఎండీ ఓపెన్ హౌస్ ఎగ్జిబిషన్



ఐఎండీ పనితీరును సందర్శకులకు వివరిస్తున్న వాతావరణ శాఖ ఉద్యోగి



వేడుకల్లో పాల్గొన్న కాకినాడ వాతావరణ పరిశీలన కేంద్రం ఉద్యోగులు, సందర్శకులు

బాలాజీచెరువు: భారత వాతావరణ శాఖ (ఐఎండీ)150 ఏళ్ల వేడుక సందర్భంగా రెండు రోజుల పాటు స్థానిక పీఆర్ కళాశాల మైదానంలో నిర్వహించిన ఓపెన్ హౌస్ ఎగ్జిబిషన్ గురువారం ముగిసింది. ఈ ఎగ్జిబిషన్‌ను సందర్శించిన విద్యార్థులు, ప్రజలు, వాకర్స్ తదితరులకు వాతావరణ శాఖ పరికరాలు, వాటి పనితీరును ఐఎండీ ఉద్యోగులు మాణిక్యాలరావు, అశోక్, నరసింహమూర్తి, షేక్ రియాజ్ తదితరులు వివరించారు. నేటి వాతావరణం ఎలా ఉంటుంది? ఎండ ఉంటుందా? పొగ మంచు ఉంటుందా? వర్షాలు కురుస్తాయా? ఉష్ణోగ్రతలు ఎలా ఉంటాయి? తదితర విషయాలను అర్థమయ్యేలా విశ్లేషించారు. ఈ సందర్భంగా కాకినాడ వాతావరణ పరిశీలన కేంద్రం శాస్త్రవేత్త డి.రాంబాబు మాట్లాడుతూ, నిత్యం వాతావరణం, ఇతర అంశాలపై దిశానిర్దేశం చేసే ఐఎండీ 150 ఏళ్ల వేడుకతో మంచి గుర్తింపును తెచ్చుకుందన్నారు.

ముగిసిన కావమ్మ తిరునాళ్లు



కావమ్మ, మారెయ్యను దర్శించుకుంటున్న భక్తులు

సామర్లకోట: పట్టణంలోని రజకపేటలో ఏలేరు కాలువ ఆవలి వైపు ఉన్న కావమ్మ ఆలయం వద్ద సంక్రాంతి పర్వదినం సందర్భంగా నిర్వహించిన తిరునాళ్లు గురువారం ముక్కనుమతో ముగిశాయి. మండలంలోని అనేక గ్రామాలకు చెందిన రైతులు, వ్యవసాయ కూలీల కుటుంబాల వారు కావమ్మ, మార్యెయ్యను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పిల్లలను ఆకర్షించడానికి వివిధ రకాల ఆటలు ఏర్పాటు చేశారు. పాఠశాలలకు సెలవులు ఉండటంతో తిరునాళ్లకు అధిక సంఖ్యలో పిల్లలు తరలివచ్చారు. ఆలయం వద్ద నెట్ గేమ్ కూడా ఏర్పాటు చేశారు. కావమ్మ సతీసహగమనం చేసిన ప్రదేశంలో ఏర్పాటు చేసిన బావి వద్ద మహిళలు పెద్దఎత్తున పూజలు చేశారు. పోలీసుల హెచ్చరికల నేపథ్యంలో ఈ ఏడాది గుండాట ఏర్పాటు చేయలేదు. తిరునాళ్లు ప్రశాంతంగా జరిగాయి. ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని ఈ నెల 22న అన్న సమారాధన ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు సుకపల్ల నాగేశ్వరరావు, మారిబాబు తెలిపారు.

ఉత్కంఠభరితంగా క్రికెట్ టోర్నీ



క్రికెట్ టోర్నమెంట్‌లో తలపడుతున్న క్రీడాకారులు

కరప: క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ కరప(సీఏకే) ఆధ్వర్యంలో స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న సంక్రాంతి క్రికెట్ టోర్నమెంట్-2025 పోటీలు జోరుగా సాగుతున్నాయి. టోర్నమెంట్‌లో భాగంగా గురువారం నాలుగు మ్యాచ్‌లు జరిగాయి. తొలి మ్యాచ్‌లో జెడ్.భావారం, వేళంగి-1 జట్ల మధ్య నువ్వా-నేనా అన్నట్టు ఉత్కంఠభరితంగా సాగింది. చివరికి వేళంగి-1 జట్టు నాలుగు పరుగుల తేడాతో విజయఢంకా మోగించింది. మరో మ్యాచ్ పెద్దాపురప్పాడు, సీఏకే ఫ్రెండ్స్-11 జట్ల మధ్య జరగ్గా, పెద్దాపురప్పాడు జట్టు 36 పరుగుల తేడాతో గెలుపొందింది. మూడో మ్యాచ్‌లో వేళంగి-2 జట్టుపై కరప వారియర్స్ జట్టు ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. నాలుగో మ్యాచ్‌లో గురజనాపల్లి జట్టు చేతిలో కరప ర్యాక్స్ జట్టు పరాజయం పాలైంది. సీఏకే సభ్యులు నక్కా భీమ్, ఎం.దుర్గాకిరణ్, పోలిశెట్టి సునీల్ ఈ పోటీలను పర్యవేక్షించారు.

నిత్యావసర సరకుల పంపిణీ



నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

కాకినాడ రూరల్: లయన్స్ క్లబ్ కాకినాడ విజన్ ఆధ్వర్యంలో స్థానిక రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో గురువారం పలువురికి నిత్యావసర సరకులను, భోజనం ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ కాకినాడ విజన్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రసూన, శ్రీదేవిరెడ్డి మాట్లాడుతూ, ప్రతిఫలం ఆశించకుండా పేదలకు తమవంతుగా సహాయం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో దాత మీనాక్షి, అడబాల రత్నప్రసాద్, డాక్టర్ శిరీష, రేలంగి రాజు, రెడ్నం రాజా తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ప్రాంత చట్టంపై నేటి నుంచి ఎంఓటీలకు శిక్షణ

సామర్లకోట: గిరిజన ప్రాంతాల్లో నివాసితులకు వారి చట్టాలపై అవగాహన కల్పించడానికి మాస్టర్ ట్రినర్ల(ఎంఓటీ)కు శుక్రవారం నుంచి రెండు బ్యాచ్‌ల్లో శిక్షణ ఉంటుందని విస్తరణ శిక్షణా కేంద్రం(ఈటీసీ) మేనేజర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, విస్తరణ శిక్షణా కేంద్రం పరిధిలోని 38 మండలాల్లోని అధికారులకు శిక్షణ ఉంటుందన్నారు. ప్రతి మండలం నుంచి ఎంపీడీఓ, ఈఓపీఆర్డీ, ఇద్దరు పంచాయతీ కార్యదర్శులు శిక్షణకు హాజరవుతారని తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న ఎంఓటీలు ఆయా మండలాలకు వెళ్లి శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. గిరిజన ప్రాంతాల్లో నివసించే వారి హక్కులు, బాధ్యతలు తెలుసుకోవడానికి ఈ శిక్షణ దోహదపడుతుందన్నారు.

బీచ్ రోడ్డులో వాహనాల రాకపోకల నిలిపివేత



ఉప్పాడ బీచ్ రోడ్డులో వాహనాల రాకపోకలను నిలిపివేసిన పోలీసులు

కొత్తపల్లి: సంక్రాంతి సందర్భంగా బీచ్ రోడ్డులో అధిక సంఖ్యలో పర్యాటకులు చేరుకోవడంతో గురువారం పోలీసులు ఈ రహదారిలో రాకపోకలను నిలిపివేశారు. ఉప్పాడ బీచ్ రోడ్డు సెంటర్ నుంచి వాహనాలను పిఠాపురం వైపు మళ్లిస్తున్నారు. సుబ్బంపేట నుంచి నేమాం వరకున్న తీర ప్రాంతంలో అధిక సంఖ్యలో పర్యాటకుల వాహనాలు బీచ్ రోడ్డులో నిలిపివేయడంతో ట్రాఫిక్ జాం అయింది. దీంతో ఉప్పాడ బీచ్ రోడ్ నుంచి, వాకలపూడి లైట్ హౌస్ నుంచి వాహనాలను పోలీసులు దారి మళ్లించారు.

మత సామరస్యానికి ప్రతీక

- భిన్నత్వంలో ఏకత్వం చాటుతున్న తొమ్మిది మూరల సాహెబ్ దర్గా
- ఉరుస్ సందర్భంగా 20 నుంచి మూడు రోజుల పాటు గంధోత్సవం



పెద్దాపురంలోని తొమ్మిది మూరల సాహెబ్ సమాధి

పెద్దాపురం: సుమారు 354 ఏళ్ల చరిత్ర కలిగిన పట్టణ శివారులోని హజ్రత్ షేక్ మదీనా పాచ్చా ఔలియా(తొమ్మిది మూరల సాహెబ్) దర్గా మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. బాబావారి ఉరుస్ గంధోత్సవాన్ని ఈ నెల 20వ తేదీ నుంచి మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించేందుకు దర్గా కమిటీ ఏర్పాట్లు చేసింది. ఉరుస్ సందర్భంగా దర్గా వద్దకు కులమతాలకతీతంగా అన్ని వర్గాల ప్రజలు విచ్చేసి బాబా ఆశీస్సులు పొందుతారు. ముస్లిం పెద్దలు, అంజుమన్ వ్యవస్థాపకుడు దివంగత ఎంఏ సత్తార్ ఇంటి వద్ద నుండి 20వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు గంధం ఊరేగింపు మేళతాళాలతో బయలుదేరి దర్గా వద్దకు చేరుకుంటుంది. సాయంత్రం ఏడు గంటలకు హైదరాబాద్ వారు రూపొందించిన చాదర్(పచ్చటి వస్త్రం) బాబా సమాధికి అలంకరించి, ఖురాన్ పఠనంతో గంధాన్ని పూస్తారు. భక్తులు ఈ గంధాన్ని భక్తిశ్రద్ధలతో స్వీకరిస్తారు.

పార్టీలకతీతంగా..

మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే ఈ ఉరుస్ ఉత్సవాన్ని ఏటా పార్టీలకతీతంగా, ప్రజల సహకారంతో వైభవంగా నిర్వహిస్తారు. దర్గాకు ఎటువంటి ఆస్తులు లేకపోవడంతో, దాతల సహకారంతో పైకప్పు ఏర్పాటు చేశారు. భక్తుల కోసం మరుగుదొడ్లను నిర్మించారు.

ప్రముఖుల హాజరు

ఉరుస్ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ దవులూరి దొరబాబు, కౌడా చైర్మన్ తుమ్మల బాబు, ఆదిత్య యూనివర్సిటీ చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు తదితర ప్రముఖులు హాజరవుతారు. ఈ నెల 22వ తేదీ వరకు గంధోత్సవాన్ని ఘనంగా నిర్వహించి, మూడో రోజు భారీ అన్నదానాన్ని ఏర్పాటు చేస్తారు.

వివిధ సేవా కార్యక్రమాలు

దర్గా కమిటీ సభ్యులు ఎండీ లాయక్ ఆలీ, బాబూలాల్, ఎండీ ఆషిక్ ఆలీ, రజాక్, సయ్యద్ కరీం జానీ బ్రదర్స్, షేక్ గౌస్, షేక్ రఫీ, షబ్బీర్, జలీల్, బాజీ, రిజ్వాన్, ఇర్షాద్ ఆలీ, హాఫిజ్, జాకీర్ తదితరుల ఆధ్వర్యంలో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే యాత్రికులకు మూడు రోజుల పాటు ఏర్పాట్లు చేస్తున్నారు. అన్ని మతాల వారితో కలిపి వివిధ సేవా కార్యక్రమాలు, పేదలకు వస్త్రదానం వంటివి నిర్వహిస్తున్నారు. 20వ తేదీ రాత్రి రాజమహేంద్రవరం వారితో మిమిక్రీ ట్రాక్, మ్యూజికల్ ప్రోగ్రాంతో పాటు ఖవ్వాలీని ఏర్పాటు చేశారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ఉక్కుపాదం



లైసెన్సులు లేకుండా వాహనాలు నడుపుతున్న యువకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

పిఠాపురం: పట్టణంలో నేరాలు పెరిగిపోతున్నాయని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ బహిరంగంగా హెచ్చరికలు చేసిన నేపథ్యంలో పోలీసులు చర్యలు ముమ్మరం చేశారు. పిఠాపురం సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నియోజకవర్గ పరిధిలో తనిఖీలు ముమ్మరం చేశారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. పిఠాపురం పట్టణంతో పాటు, గొల్లప్రోలు నగర పంచాయతీ, పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు.. మందుబాబులపై కన్నెర్ర చేస్తున్నారు. ట్రాఫిక్ రెగ్యులేషన్, ప్రయాణికుల భద్రతపై దృష్టి సారించిన పోలీసులు వాహనదారులకు అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నారు. అపరిచిత వ్యక్తుల కదలికలపై నిఘా ఏర్పాటు చేశామని పిఠాపురం సీఐ శ్రీనివాస్ ఈ సందర్భంగా తెలిపారు. అపరిచిత వ్యక్తులు కానీ, అనుమానిత వ్యక్తులు, వస్తువులు ఏం కనిపించినా వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎటువంటి లైసెన్సులు లేకుండా వాహనాలు నడుపుతున్న మైనర్లను నిలువరించి, వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు తెలిపారు. సంక్రాంతి పండగలో పేకాట, కోడిపందేలు గుండాట ఆడేవారు, నిర్వాహకులను కలిపి మొత్తం 389 మందిని బైండోవర్ చేశామన్నారు. పేకాట, కోడిపందేలపై సమాచారంతో రెండు కేసులు నమోదు చేసి, మొత్తం 2 కోళ్లు, రూ.24,180 నగదును సీజ్ చేసి, 14 మందిని అరెస్ట్ చేశామన్నారు. కోడి పందేల జరిగే ప్రదేశాలకు చెందిన 35 మంది స్థల యజమానులకు నోటీసులు ఇచ్చామన్నారు. రోడ్డు ప్రమాదాలు, ఇతర నేరాల నియంత్రణకు విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తూ, 15 డ్రంక్ అండ్ డ్రైవ్, 66 ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు చేశామని వివరించారు.



పిఠాపురంలో పోలీసులు స్వాధీనం చేసుకున్న రికార్డులు లేని వాహనాలు